క్లుప్తంగా

రైతులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): పంటల సాగులో సలహాలు, సూచనలు పొందటానికి రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌కు విధిగా హాజరు కావాలని ఆర్మూర్ డివిజన్ వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం జరిగిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. అనంతరం ధాన్యం ఆరబోసిన కల్లాల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. ఏవో మధుసూదన్, ఏఈవోలు ప్రశాంత్, మౌనిక, నాయకులు భూమేశ్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



మాక్లూర్: బీజేపీని మరింత బలోపేతం చేయటానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అడవి మామిడిపల్లిలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ సురేష్‌నాయక్ అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను దక్కించుకోవాలన్నారు. నాయకులు సంతోష్, ప్రవీణ్, అనిల్‌కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే నుడా విస్తరణ



ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ లబ్ధి కోసం నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని విస్తరించాలని చూస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగొట గంగాధర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవ చేయాలని కాంగ్రెస్‌కు ఉంటే విస్తరణ ఆపి బోధన్ మున్సిపాలిటీ, ఆర్మూర్ మున్సిపాలిటీ, భీంగల్ మున్సిపాలిటీలకు డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నాయకులు పోల్కం వేణు, అరె రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులను విధుల్లోకి తీసుకోండి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య కార్మికులతో కలిసి పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు వెంకటేష్, కార్మికులు దేవై, పిట్ల సత్తెమ్మ కవిత, శన్ను పాల్గొన్నారు.

పింఛన్ అందించాలి

రుద్రూర్: ప్రతి బీడీ కార్మికురాలికి జీవన భృతి పింఛన్ ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీడీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం బీడీ కార్మికులందరూ సంఘటితమై ఉద్యమించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు చంద్రమోహన్, సావిత్రి, మాధవిలత, శోభ, లలిత పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

మోర్తాడ్: మండలకేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ మంగళవారం తనిఖీ చేశారు. ఇన్వెంటోరి వెరిఫికేషన్ సిస్టమ్‌లో భాగంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఏవో హరీష్, డీలర్లు సునీల్, వంశీ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బడి మైదానాన్ని చదును చేయించిన ఎమ్మెల్యే

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ కేజీబీవీ పాఠశాల మైదానాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. మైదానం మొత్తం పిచ్చి మొక్కలతో ఆడుకోవడానికి వీలులేకుండా మారడంతో స్థానిక బీజేవైఎం నాయకుడు ఖాందేష్ ప్రశాంత్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. ఎమ్మెల్యే స్పందించి తన సొంత ఖర్చులతో పిచ్చి మొక్కలను తొలగింపచేసి మొరంతో చదును చేయించారు. ఉపాధ్యాయినులు, బీజేవైఎం నాయకుడు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- పాలెం–తొర్తి రోడ్డు పక్కన వృక్షాలను తొలగించిన వ్యక్తి
- పట్టించుకోని అధికారులు



పాలెం రోడ్డు పక్కన నరికివేసిన చెట్లు

మోర్తాడ్: తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో నాటించి పెంచిన చెట్లను కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా నాటించిన చెట్లతో వాహనదారులకు ఆహ్లాదకరమైన వాతావరణం దక్కితే కొంతమంది తమకు అడ్డుగా ఉన్నాయని నరికివేస్తున్నారు. మోర్తాడ్ మండలం పాలెం నుంచి ఏర్గట్ల మండలం తొర్తికి వెళ్లే మార్గంలో ఉన్న చెట్లను రెండు రోజుల కింద ఒక వ్యక్తి పూర్తిగా నరికివేయించాడు. హరితహారం కార్యక్రమంలో ఎంతో కష్టపడి మొక్కలు నాటించి వాటిని సంరక్షిస్తే ఇష్టం వచ్చినట్లు నరికివేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో జరిమానాలు..

చెట్లు నరికిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని భారీ మొత్తంలో జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు కూడా చెట్ల నరికివేతపై సీరియస్‌గా ఉన్నారు. గతంలో చెట్ల కొమ్మలను నరికితే రూ.5వేల వరకు జరిమానా విధించారు. ఇప్పుడు మొత్తం చెట్లనే నరికివేయడంతో అధికారులు ఏ విధంగా స్పందిస్తారో అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని సుంకెట్‌లో చెట్లు నరికిన వారికి, హరితహారం మొక్కలు తొలగించిన వారికి అప్పటి సర్పంచ్ శ్రీనివాస్ వినూత్నమైన రీతిలో శిక్ష విధించారు. ఒక చెట్టు నరికితే పది మొ క్కలను నాటించారు. జరిమానా సైతం వసూలు చేశారు. ఇలాంటి శిక్షలను విధిస్తేనే చెట్లను సంరక్షించడం సాధ్యమైతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

డొంకేశ్వర్ పీహెచ్‌సీలో..



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆహ్లాదాన్ని పంచే ఇరవైకి పైగా పెద్ద వృక్షాలను నేల మట్టం చేయడంతో పీహెచ్‌సీకి వచ్చే రోగులకు నీడ కరువైంది. ఏళ్లనాటి భారీ వృక్షాలను నరికివేయడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క మొక్కలు నాటాలని చెబుతున్న అధికారులే మరోపక్క నరికివేతకు పూనుకోవడం గమనార్హం. ఈ విషయమై పీహెచ్‌సీ అధికారులను వివరణ కోరగా ట్రాన్స్‌కో, గ్రామస్తులు నరికివేయించినట్లు తెలుపుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

చెట్లను ఎవరు నరికినా కఠిన చర్యలు తప్పవు. రోడ్డు పక్కన ఉన్న చెట్లను నరికిన వ్యక్తి సమాచారం సేకరిస్తున్నాం. జరిమానా వసూలు చేస్తాం. ముందు ఎవరు చెట్లు నరకకుండా ఉండాలని మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేయించాం. కఠినంగానే వ్యవహరిస్తాం. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు.

– సంతోష్ రాజారావు, కార్యదర్శి, పాలెం

సర్వేలో వివరాలు సరిగా నమోదు చేయాలి



బాల్కొండ మండల కేంద్రంలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్



ఆలూర్‌లో.. ఆర్డీవో రాజాగౌడ్

సాక్షినెట్‌వర్క్: సర్వే వివరాలను ఎన్యుమరేటర్లు సరిగా నమోదు చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఈమేరకు పలు మండలాల్లో కొనసాగుతున్న సర్వేను మంగళవారం పలువురు పరిశీలించారు.

బాల్కొండ మండలంలో సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. సర్వేపై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తు ప్రశ్నలకు సమాధానాలను రాబట్టాలన్నారు. వివరాల సేకరణలో లోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆలూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను ఆర్డీవో రాజాగౌడ్ పరిశీలించారు. ఆర్మూర్‌లో కొనసాగుతున్న సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. కమ్మర్‌పల్లి మండలంలో ఎంపీడీవో రాజశ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, కమ్మర్‌పల్లి జీపీ కార్యదర్శి శాంతికుమార్ పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

ఆధ్యాత్మికం..

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి అర్చన



కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లిలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో మంగళవారం లక్ష తులసి అర్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి మహా నైవేద్యం హారతి సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా తులసి దళాలు పండ్లతో పాటు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు.

ఆలయాల్లో 'కార్తీక ఏకాదశి' పూజలు



రుద్రూర్: మండల కేంద్రంలోని పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక ఏకాదశి పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు, కాగడ హారతి ఇచ్చారు. తులసి చెట్టు వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆర్మూర్ పట్టణంలో..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవనాథ సిద్ధుల గుట్టకు భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో భక్తులు ఉదయం భక్తిశ్రద్ధలతో కాగడ హారతి చేపట్టారు. అనంతరం ఆలయ పూజారికి భక్తులు దీపదానం చేశారు.

నేటి నుంచి అన్నదానం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని భీమునిగుట్ట ఆవరణలోగల అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిత్యాన్నదాన కమిటీ అధ్యక్షుడు కొయ్యాడ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాములకు, భక్తులకు నిత్య అన్నదానం మధ్యాహ్నం 12గం.ల నుంచి 2గం.ల వరకు ఉంటుందన్నారు. దాతలు రూ. 5,200 చెల్లించి అన్నదానం చేయవచ్చని తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రెంజల్(బోధన్): రెంజల్‌లోని ముత్యాలమ్మ ఆలయ 4వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సంక్షిప్తం

అధికారులపై దాడి అమానుషం

బాల్కొండ/కమ్మర్‌పల్లి/నవీపేట: వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగయ్య నాయక్, రెవెన్యూ సిబ్బందిపై కొడంగల్ నియోజకవర్గం లగచర్ల గ్రామంలో పలువురు దాడిచేయడం అమానుషమంటూ పలువురు అధికారులు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం బాల్కొండ, ముప్కాల్, మెండోరా, కమ్మర్‌పల్లి, నవీపేట్ మండలాల్లో మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దాడి చేసిన వారు ఎంతటి వారైన కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చెరువులో చేప పిల్లల విడుదల

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ బెల్లాల్ చెరువులో మంగళవారం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి చేప పిల్లలను విడుల చేశారు. కమిషనర్ వెంకట నారాయణ, తహసీల్దార్ విఠల్, ఏవో కృష్ణ వేణి, కాంగ్రెస్ నాయకులు పాషా మోయినొద్దీన్, కోట అబ్బయ్య, గంగాధర్, భూమయ్య, సుల్తాన్, సాయిలు, లక్ష్మయ్య, తోకల చిన్న పోశెట్టి, గంగాధర్, దాల్ మల్క పోశెట్టి ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

నవీపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పోలు సత్యనారాయణ మంగళవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో టీచర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచార కరపత్రాలను అందజేసి ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

పీఎం, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం

నందిపేట్/బాల్కొండ: నందిపేట, బాల్కొండలో పోస్ట్ ఆఫీస్ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనందుకు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయా మండలాలో మంగళవారం పీఎం నరేంద్ర మోదీ, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో మంగళవారం వేంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర జైడి రవి ప్రారంభించారు. వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రుద్రూర్: కోటగిరిలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ యూనియన్ రాష్ట్ర మహా సభలకు సంబంధించిన పోస్టర్లను యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 1, 2 తేదీల్లో కామారెడ్డి లో మహాసభలుజరుగుతాయని పేర్కొన్నారు. ఎంఈవో శ్రీనివాస్ రావ్, యూనియన్ నాయకులు మల్లికార్జున్, విజయ్‌కుమార్, వంశీ, విశాల్, లత, సువర్ణ జ్యోతి ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



వర్ని: ప్రభుత్వం నిరుపేదల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. వర్నిలో మంగళవారం చందూర్, రుద్రూర్, వర్ని మండలాలకు చెందిన కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలన్నీ పేదల కోసమేనని, పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నందిపేటలో భూవివాదం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని వ్యాస్‌ల అడ్డాగా పిలువబడే వివాదస్పద భూమి వద్ద మంగళవారం ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇట్టి భూమి విషయమై రేష్మబేగం అనే మహిళతో పాటు రెవెన్యూశాఖతోపాటు గ్రామస్తులు ఎవరికి వారు తమ భూమి అంటూ కబ్జా చేయడానికి ప్రయత్నించడంతో పలుమార్లు ఘర్షణ నెలకొంది. అయితే సర్వే నంబరు 925లో గల ఎకరం 25గుంటల భూమి తమకు చెందినదిగా కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చిందని రేష్మాబేగం కుటుంబీకులు మంగళవారం చదును చేసే ప్రయత్న చేశారు. దీంతో నందిపేట వీడీసీ సభ్యులు జేసీబీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. రేష్మాబేగం కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా నందిపేటలో 925 సర్వే నంబరు రికార్డులో లేదని, నందిపేటలో ఇప్పటి వరకు భూ రీసర్వే జరుగలేదని తహసీల్దార్ ఆనంద్ తెలిపారు. కోర్టు తీర్పు ఒకరి పక్షాన రాలేదని, ఎవరి భూమి వారు చూసుకోవాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. అట్టి స్థలాన్ని ఎవరైనా కబ్జాకు చేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్: మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను మంగళవా రం సాలూర శివారులో పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఇసుక టిప్పర్, ట్రాక్టర్‌ను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సోయాబీన్ చోరీ

బోధన్ రూరల్: మండలంలోని బండార్‌పల్లిలో రైతు రెడ్డి భూమయ్యకు చెందిన సోయాబీన్ చోరీకి గురైంది. తన పొలంలో నాలుగున్నర ఎకరాల్లోని సోయాబీన్ పంటను నూర్పిడి చేసి అమ్ముకునేందుకు రాజన్న చౌరస్తా వద్ద గల రోడ్డు పక్కన కుప్పవేసి పెట్టినట్లు బాధిత రైతు తెలిపారు. కానీ అందులోంచి సుమారు 16 క్వింటాళ్లు ఎవరో ఎత్తుకెళ్లినట్లు ఆరోపించారు. ఈమేరకు బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



బోధన్‌రూరల్: రైతులు తమ పొలాల్లో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈ (నిజామాబాద్), సెఫ్టీ ఆఫీసర్ రమేష్ అన్నారు. మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో మంగళవారం టీజీఎన్‌పీడీసీఎల్– బోధన్ సెక్షన్ (విద్యుత్ శాఖ) ఆధ్వర్యంలో 'విద్యుత్ శాఖ–పొలం బాట' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల పొలాల్లో పర్యటించి విద్యుత్ ప్రమాదాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏదైనా విద్యుత్ ప్రమాదాలు జరిగినా, జరిగే పరిస్థితులు ఉన్నా.. వెంటనే సంబంధిత అధికారులకు కానీ, విద్యుత్ శాఖ కార్యాలయంలో కానీ సమాచారం అందించాలని సూచించారు. బోధన్ ట్రాన్స్‌కో ఏడీఈ నాగేష్ కుమార్, ఏఈ కళ్యాణ్, సబ్ ఇంజనీర్లు ఓం ప్రకాష్, రాజశేఖర్, రైతులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమస్ఫూర్తిని రగిలించిన గ్రామం మోతె



మోతెలో మండలస్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- మోతెలో వేల్పూర్ మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

వేల్పూర్: ఉద్యమస్ఫూర్తితో మలిదశ తెలంగాణ ఉద్యమానికి మోతె గ్రామం ఊపిరిలూదిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మోతె గ్రామంలో మంగళవారం ఆయన మండలస్థాయి క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆనాడు ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఉద్యమస్ఫూర్తిని పొందేందుకు మోతె మట్టిని ముడుపు కట్టి తెలంగాణ భవన్‌కు తీసుకెళ్లారన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తిరిగి సీఎం హోదాలో మోతెకు వచ్చి ముడుపు విప్పారన్నారు. క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఆటల్లో గెలుపు, ఓటమిని సహజంగా తీసుకోవాలన్నారు.అంతకుముందు విద్యార్థుల నుంచి ఆయన గౌరవవందనం స్వీకరించారు. మార్చిఫాస్ట్‌లో మోతెకు ప్రథమ, పచ్చలనడ్కుడకు ద్వితీయ స్థానం రాగా, పడగల్, కస్తూర్బాస్కూలుకు కన్సోలేషన్ బహుమతులు వచ్చాయి. క్రీడల ప్రారంభోత్సవంలో విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. ఎంఈవో రేణుక, గణేష్, దేవానందం, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు దొల్ల రాజేశ్వర్‌రెడ్డి, మోతెరాజేశ్వర్ ఉన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి



డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

డొంకేశ్వర్(ఆర్మూర్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ ఆదేశించారు. మండల కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో టీచర్స్, గ్రాడ్యుయేర్స్ కోసం వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఆర్‌ఐ అశోక్‌సింగ్, జీపీ కార్యదర్శి శేఖర్‌గౌడ్ ఉన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ గజానంద్, డిప్యూటీ తహసీల్దార్ పద్మ మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లకు పాఠశాల గదులను పరిశీలించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు



గోదావరిలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు



శివాలయం వద్ద బైక్‌లకు పార్కింగ్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని పవిత్ర గోదావరికి మంగళవారం ఏకాదశి కార్తీక మాసం సందర్భంగా భక్తులు పోటెత్తారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి తీరన గల శివాలయంలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

పార్కింగ్ పేరుతో డబ్బుల వసూలు..

గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించుటకు వస్తున్న భక్తుల నుంచి దేవాదాయ శాఖ అధికారులు వాహనాల పార్కింగ్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా ఎలాంటి టెండర్ నిర్వహించకుండ ఆలయాల వద్ద, గోదావరికి వచ్చే భక్తుల వద్ద పార్కింగ్ రుసుం బైక్‌కు రూ.10, కారుకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. పండుగ రోజులలో కాకుండా ప్రతిరోజు పార్కింగ్ రుసుం వసూలు చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోజూ వసూలు చేసిన మొత్తం ఎంత ఉంది. ఎంత మంది చెల్లిస్తున్నారు అనేది అధికారులకే తెలుసు. ఉన్నతాధికారులు స్పందించి భక్తులకు ఇబ్బందులు కలగకుండ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 – క (తెలుగు)-11.45 3.05 6.25; అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -9.45
- స్క్రీన్-3 – లక్కీ భాస్కర్(తెలుగు)-10.00 1.15 7.30 10.45; బ్లడీ బెగ్గర్(తెలుగు)-4.30
- స్క్రీన్-4 – అమరన్ (తెలుగు) - 12.00 3.30 7.00 10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -10.35; లక్కీ భాస్కర్(తెలుగు)-1.30; క(తెలుగు)- 4.30 10.30; జితేందర్‌రెడ్డి(తెలుగు)- 7.30
- స్క్రీన్-3 అమరన్ -10.20, 4.20, 10.35; అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -1.30; లక్కీ భాస్కర్(తెలుగు)-7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 అమరన్ -12.00,6.45, 10.15; క(తెలుగు)-3.30



- స్క్రీన్-2 అమరన్(తెలుగు)-10.00; అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -1.30; లక్కీ భాస్కర్ -4.15,7.30,10.45
- స్క్రీన్-3 సింగం అగైన్ (హిందీ)-10.50; భూల్ భులయ్యా (హిందీ)-2.00; అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -5.00; జితేందర్‌రెడ్డి(తెలుగు)-7.45; క(తెలుగు)-10.45
- స్క్రీన్ -4 భూల్ భులయ్యా (హిందీ)=10.00 7.05 - వంచన(తెలుగు)-1.25; బ్లడీ బెగ్గర్(తెలుగు)-4.05; సింగం అగైన్(హిందీ)-10.30

- లలితామహల్ దేవర పార్ట్-1 (తెలుగు)
- దేవి లక్కీ భాస్కర్ (తెలుగు)
- నటరాజ్ అమరన్ (తెలుగు)
- విజయ్ క (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,300	వెండి(కిలో)	99,000
22 క్యారెట్స్	75,017		

– నిజామాబాద్ బిజినెస్